ప్రజాశక్తి
గురువారం 19 అక్టోబర్ 2023   8 పేజీలు

గుంటూరు   పల్నాడు

నిర్మాణ రంగం కుదేలు

- ఇనుము, సిమెంట్, కంకర ధరలు పెరుగుదల
- పనులు దొరక్క భవన నిర్మాణ కార్మికులకు అవస్థలు
- సిఎం ప్రకటనతో అయోమయంలో నిర్మాణదారులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నిర్మాణ రంగం మళ్లీ సంక్షోభంలో చిక్కుకుంది. కొన్ని రోజులుగా నిర్మాణ రంగానికి చెందిన మెటీరియల్ ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రధానంగా ఇసుక, సిమెంట్, కంకర ధరలు భారీగా పెరిగాయి. ఇప్పటికే రాజధాని వ్యవహారంలో ప్రభుత్వ వైఖరి కారణంగా నాలుగేళ్లుగా నిర్మాణ రంగం బాగా దెబ్బతింది. కోర్టు ఉత్తర్వులతో రాజధాని ఇక్కడే ఉంటుందని నమ్మకంతో గత రెండేళ్లకాలంలో కొంత వరకు నిర్మాణాలు కొనసాగాయి. తాజాగా నిర్మాణ రంగ మెటీరియల్ ధరలు భారీగా పెరగడం, దసరాకు, ఆతరువాత డిసెంబరుకు విశాఖకు మకాం మారుస్తున్నట్టు సిఎం జగన్ చేసిన ప్రకటనతో నిర్మాణ దారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఎన్నికల వరకు వేచిచూసే ధోరణితో ఉంటే మేలని బిల్డర్లు భావిస్తున్నారు.

మరోవైపు సిమెంట్ కంపెనీలు బస్తాకు రూ.50 నుంచి రూ.90 వరకు పెరిగాయి. రిటైల్‌లో ఒక్కో కంపెనీ డీలర్లు ఒక్కో ధరకు విక్రయిస్తున్నారు. గతనెల రోజుల్లో బస్తాకు రూ.50పైనే పెరిగింది. దీంతో స్థానిక వ్యాపారులు రూ.90 వరకు పెంచి అమ్ముతున్నారు. గత నెలలో కంకర టన్ను రూ.300 ఉండగా ఈనెలలో రూ.600కు

బ్రాడీపేటలోని కంకరగుంట గేటు వద్ద పనుల కోసం నిరీక్షిస్తున్న కార్మికులు

పెంచారు. ఇనుము టన్ను రూ.5 వేల నుంచి ఆరు వేలవరకు పెరిగింది. గతనెలలో ఇనుము టన్ను రూ.60 వేలు ఉండగా ఈ నెలలో రూ.66 వేలకు చేరింది. మట్టి ధరలు లారీకి రూ.2000 పెంచారు. ఇలా నిర్మాణ రంగానికి అవసరమైన అన్ని రకాల మెటీరియల్ ధరలు భారీగా పెరిగాయి.

తగ్గని ఇసుక ధరలు

జిల్లాలో ఇసుక ధరలు ఏమాత్రమూ తగ్గడం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. టన్ను ఇసుక రూ.1200పైన అమ్ముతున్నారు. నాలుగున్నరే క్రితం ఉమ్మడి జిల్లాలో ట్రాక్టరు ఇసుక రూ.1500 నుంచి రూ.2000 చెల్లిస్తే దొరికేది. 2019 జులై నుంచి ఇసుక విధానం మార్చారు. అప్పటి నుంచి ఈ విధానాంలో ఎన్నో మార్పులు చేసినా సరఫరా మెరుగుపడ లేదు. ధరలు తగ్గడం లేదు. ప్రస్తుతం గ్రామాలకు చేరే సరికి రీచ్‌లకు సమీపంలో ఉన్న వారికి సైతం ట్రాక్టరు ఇసుక రూ.4 వేల నుంచి రూ.5 వేలు చెల్లించాల్సి వస్తోంది. 10 టన్నుల లారీ అయితే రూ.12,500, 30 టన్నుల లారీ అయితే మాత్రం రూ.30 వేలకు విక్రయిస్తున్నారు. ఎక్కువ మోతాదులో రవాణ చేసుకుంటే ▶ 2లో

ధర్నా అనంతరం విద్యుత్ ఎఇకి వినతిపత్రం ఇస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

ఎన్నడూ లేని విధంగా విద్యుత్ భారాలు

- కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సంస్కరణల ఫలితంగానే విద్యుత్ ఛార్జీల పెంపు
- తగ్గించాలని వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా, వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి విద్యుత్ ఎడిఇ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి వినియోగదారులపై రూ.వేల కోట్ల భారాలు మోపిందని విమర్శించారు. సర్దుబాటు చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీలు, ఇతర చార్జీల పేరుతో ఎన్నడు లేని విధంగా చార్జీలు పెంచిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణల్లో భాగంగానే ఈ ఛార్జీలని చెప్పారు. అనంతరం విద్యుత్ ఎఇ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు పి.బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, నాయకులు కె.ఏడుకొండలు, జె.శివభవన్నారాయణ, జె.బ్రాహ్మణి, ఎన్.వెంకటేశ్వరరావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నాయకులు ఎన్.బ్రహ్మేశ్వరావు, జె.జాన్‌బాబు, జిసామ్‌రెడ్డి, జె.సాంబశివరావు, టి.వెంక టయ్య, డి.ఈశ్వరరావు, ఎ.మరియదాసు, జి.జానీ, బి.శ్రీనివాసరావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు కె.కోటేశ్వరరావు, ఎ.ఆదినారాయణ పాల్గొన్నారు.

హైలెవల్ ఛానల్ పనులు పూర్తి చేయాలి

పాదయాత్రలో ప్రజలు విన్నవించిన సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - దుగ్గిరాల

హైలెవెల్ ఛానల్ పనులను పూర్తి చేసి సాగు, తాగునీరు సరఫరా చేయడం ద్వారా రైతులను ఆదుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ప్రజా చైతన్య పాదయాత్రలో భాగంగా మండలంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. కార్యక్రమానికి సిపిఎం మండల ▶ 2లో

ధర్నాలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

వ్యర్థాలను తొలగిస్తున్న జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

ఎఆర్‌టి కేంద్రంలో వ్యర్థాల తొలగింపు

సిబ్బందిపై జిజిహెచ్ సూపరింటెండెంట్ అసంతృప్తి 8 లో

సత్తెనపల్లి మండలంలో సమస్యలు చెబుతున్న మహిళలు

కరువు మండలాలుగా ప్రకటించి ఆదుకోండి

- పాదయాత్రల్లో సిపిఎం నాయకుల డిమాండ్
- పనుల్లేక ఇబ్బంది పడుతున్నామని, రుణాలకు వడ్డీ మాఫీ చేయాలని ప్రజల నుండి విన్నవపాలు

4 లో

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మార్గదర్శకాల మేరకే ఓటర్ల జాబితా రూపకల్పన

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్

2 లో

నిర్మాణ రంగం కుదేలు

(మొదటి పేజీ తరువాయి)

ఛార్జీలను తగ్గిస్తున్నారు. తక్కువ మోతాదులో ట్రాక్టరు, చిన్న లారీలకు అయితే ధరలు పెంచుతున్నారు. ఇసుక రీచ్‌ల నుంచి 15 కిలో మీటర్ల దూరంలోపు అయితేనే ట్రాక్టరు అనుమతిస్తున్నారు. అంతకంటే ఎక్కువ దూరం రానివ్వడం లేదు. దీంతో 30 టన్నులు లారీని ఒక్కరే తెప్పించుకుని రిటైల్‌గా టన్ను రూ.1200కు విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం నిర్ధేశించిన టన్ను రూ.475 నుంచి రూ.600 (రవాణా ఛార్జీలను కలిపి) ఎక్కడా విక్రయించడం లేదు. నిర్మాణ రంగం మందగించడం వల్ల గత నెల రోజులుగా ఇసుక విక్రయాలు కూడా తగ్గాయని వ్యాపారులు తెలిపారు.

తగ్గుతున్న ఉపాధి అవకాశాలు

వేర్వేరు కారణాలతో నిర్మాణ రంగం మళ్లీ సంక్షోభంలోకి వెళ్తుండటంతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. నెలలో 20 రోజులు కూడా పనులు దొరడంలేదు. గతంలో నెలలో 30 రోజులు పనులున్నా ఆదివారం, సెలవు దినాల్లో మినహా మిగతా అన్ని రోజుల్లో పనులకు వెళ్లేవారమని, ఇప్పుడు నెలలో ఎన్ని రోజులు పనులు దొరుకుతాయో తెలియని పరిస్థితి ఏర్పడిందని కార్మికులు వాపోతున్నారు. ఈ ప్రభావం నిర్మాణ రంగంలో 32 రకాలకు చెందిన వ్యాపారులు, కూలీలపై పడుతుందని చెబుతున్నారు.

హైలెవల్ ఛానల్ పనులు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి జె.బాలరాజు అధ్యక్షత వహించారు. అప్పారావు మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రేవేంద్రపాడులో మద్రాస్ కాల్వపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుతోందని, గ్రామాల్లో డ్రెయినేజీ సమస్య వల్ల ప్రజలు డెంగీ, మలేరియా, ఇతర విషజ్వరాలు బారిన పడుతున్నారని తెలిపారు. ఈమని గ్రామంలో ఇసుక లోడుతో భారీ వాహనాలు యథేచ్ఛగా తిరగడం వల్ల మోకాలిలోతు గుంతలు పడి రోడ్లు ధ్వసంసమయ్యాయని తెలిపారు. వీటివల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు వాటిల్లుతున్నాయని, రహదార్లకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనేక గ్రామాల్లో దళితులకు శ్మశాన స్థలాల్లేక అవస్థ పడుతున్నారని తెలిపారు. అప్రకటిత విద్యుత్తు కోతలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తుమ్మపూడిలో మాస్టిన్ సామాజిక తరగతి వారికి కుల ధ్రువీకరణ పత్రాలను తహశీల్దార్ మంజూరు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, 40 ఏళ్లుగా ఇళ్లేసుకుని వారుంటున్న స్థలాలకు బీ ఫారాలకు బదులు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో తాగునీటి పైపులైను వేసి ఏడెనిమిద ఏళ్లవుతున్నా నీరు మాత్రం సరఫరా చేయడం లేదని, సత్వరమే సరఫరాకు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు ఎం.నాగమల్లేశ్వరరావు, ఎన్.యోగేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, కె.కోటయ్య, బి.అమ్మిరెడ్డి, ఏసుపాదం, పాములు, శేషగిరి పాల్గొన్నారు.

చిత్రకారుడు జగన్మోహనరావుకు అవార్డు

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ భవానీపురం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు, 'గిరిజన గీతశిల్పి' బొండా జగన్మోహనరావుకు తాజాగా ప్రతిష్టాత్మక మ్యాన్ ఆఫ్ ఎక్స్ లెన్స్ అవార్డు-2023 లభించింది. న్యూఢిల్లీకి చెందిన క్రేజీ టేల్స్ సంస్థ బొండా జగన్మోహన రావుకు ఈ అవార్డు అందించింది. అలాగే క్రేజీ టేల్స్ సంస్థ ప్రచురించిన ఇన్‌ఫ్లుయెన్షియల్ ఇండియన్స్ పుస్తకంలో కూడా బొండా జీవిత చరిత్రను ప్రచురించింది. బుధవారం పోస్టు ద్వారా ఈ అవార్డును , పుస్తకాన్ని అందుకున్న బొండా జగన్మోహనరావును నగరానికి చెందిన పలువురు చిత్రకారులు అభినందించారు. నాగరిక సమాజంలోని అనేక సామాజిక అంశాలతో పాటు కొండకోనల్లో నివసించే గిరిజనుల జీవితాలను నాగరిక సమాజానికి పరిచయం చేస్తూ గిరిజనుల జీవితాలపై కూడా వందలాది చిత్రాలను చిత్రించిన బొండా జగన్మోహనరావు ఇప్పటికీ వెయ్యికి పైగా చిత్రాలను గీశారు. ఈ సందర్భంగా బొండా జగన్మోహనరావు మాట్లాడుతు విభిన్న వర్గాలకు చెందిన వారి సామాజిక జీవన విధానాలపై చిత్రాలను గీయడం ద్వారా వారి అభ్యున్నతి కోసం చిత్రకారులు పాటుపడాలని పిలుపునిచ్చారు.

మార్గదర్శకాల మేరకే ఓటర్ల జాబితా రూపకల్పన

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రాజకీయ పార్టీల ప్రతినిధుల భాగస్వామ్యంతో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లోని అన్ని ప్రక్రియలనూ ప్రణాళిక ప్రకారం నిర్వహిస్తున్నామని గుంటూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మ, జిల్లా రెవెన్యూ అధికారి కే.చంద్రశేఖరరావుతో కలసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ 2024 ఓటర్లకు సంబంధించి వచ్చిన అన్ని క్లయిమ్‌లను ఎప్పటికప్పుడు ఈఆర్వోలు క్షేత్రస్థాయిలో బీఎల్వోల ద్వారా సక్రమంగా విచారణ చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈఆర్వో నెట్‌లో అప్లోడ్‌కు ఎన్నికల సంఘం అనుమతి మంజూరు చేసిన వెంటనే వివరాలను ఆన్లైన్‌లో అప్లోడ్ చేస్తారన్నారు. ఈవీఎంలను ఎన్నికలకు సిద్ధం చేయటానికి నిర్వహిస్తున్న ఫస్ట్ లెవల్ చెకింగ్ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా కొనసాగుతోందని చెప్పారు. సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ టి.సేవాకుమార్, బిఎస్‌పి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సిహెచ్.వాసు, బిజెపి జిల్లా జనరల్ సెక్రెటరీ ఆర్.వెంకట భాస్కరరావు సిపిఎం నాయకులు వై.కృష్ణకాంత్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సునీల్, టిడిపి ప్రచార కార్యదర్శి ఎన్.ఓంకార్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎ.జోసెఫ్ కుమార్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ , కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ కల్యాణి, తహశీల్దార్లు రాంప్రసాదు, ఫణీంద్రబాబు, జీఎంసీ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాస్, డీసీపీ కోటయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహనా కార్యక్రమాలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ (విజయవాడ)

బాల్య వివాహాలను రూపుమాపడంతో పాటు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో అవగాహనా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ హెడ్ రవికాంత్ తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము నిర్వహించే బాల్య వివాహాలు రూపుమాపుతామనే ప్రతిజ్ఞకు ప్రజల వద్ద నుండి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. వివిద ప్రాంతాలలో నిర్వహించే కార్య క్రమాలకు ఆయా స్థానిక సంస్థల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నామన్నారు. ఈసందర్భంగా బాల్య వివాహాల నుండి బయట పడిన మహిళలుచే కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి ప్రతి ఒక్కరినీ చైతన్య పరుస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాలు అనేవి యుగయుగాలుగా మన సమాజంలో పెనవేసుకుని ఉన్నాయన్నారు. ఇది నేరం అయినప్పటికీ వీటిని నివారించుట జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాము నిర్వహిస్తున్న ఈప్రచార ఉద్యమానికి అన్ని వర్గాల నుండి మంచి స్పందన లభిస్తుందన్నారు.

సాఫ్ట్ టెన్నిస్‌లో తమిళనాడు హవా

ప్రజాశక్తి- ఎడ్యుకేషన్ (విజయవాడ)

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న 18వ జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో బాలికల డబుల్స్ విభాగంలోనూ తమిళనాడు క్రీడాకారులు తమ హవాను కొనసాగించారు. బుధవారం జరిగిన బాలికల డబుల్స్‌లో తమిళనాడు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. తమిళనాడు బాలికల ద్వయం సాధన, నరుముగై 3-1 సెట్ల తేడాతో మహారాష్ట్రకు చెందిన ఆయుష, రితిక జంటపై విజయం సాధించారు. తొలుత రెండు జట్లు గెలుపు కోసం హోరా హోరీగా తలపడినప్పటికీ, చివరకు తమిళనాడు క్రీడాకారులనే విజయం వరించింది. అంతుముందు జరిగిన సెమీ ఫైనల్స్‌లో తమిళనాడుకు చెందిన సాధన, నరుముగై జంట, తమ రాష్ట్రానికే చెందిన ఎస్‌వి శమిత, యాజిని పై 3-0 సెట్లతో గెలుపొంది ఫైనల్స్‌కు చేరగా, మరో సెమీస్‌లో మహారాష్ట్రకు చెందిన ఆయుశ, రితిక ద్వయం, జమ్మూ కాశ్మీర్‌కు చెందిన సిదాని, శ్రీమాయ్‌పై 3-0తో గెలుపొంది ఫైనల్స్‌కు చేరారు. కాగా, నాలుగు రోజులుగా జరుగుతున్న సాఫ్ట్ టెన్నిస్ జాతీయస్థాయి పోటీలు గురువారంతో ముగియనున్నాయి. అనంతరం జరిగే కార్యక్రమంలో అతిథులు విజేతలకు బహుమతులను అందజేయనున్నారు.

ఇంద్రకీలాద్రికి పెరిగిన రద్దీ

ప్రజాశక్తి-వన్‌టౌన్

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం దుర్గమ్మ శ్రీమహాలక్ష్మీదేవి రూపంలో యాత్రికులకు దర్శనమిచ్చారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు యాత్రికులకు అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానికి ప్రముఖులు తరలివస్తున్నారు. దర్శనానికి నగరం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుండి యాత్రికులు తరలివచ్చారు. సుమారు 60 వేల మందికి పైగా శ్రీ మహాలక్ష్మీదేవిని దర్శించుకున్నట్లు దేవస్థాన అధికారులు చెబుతున్నారు. ఇక రానున్న రోజుల్లో ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మహామండపం వైపున గల ఖాళీ స్థలంలో ఏర్పాటుచేసిన కళావేదికపై నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. భరతనాట్యం, కూచిపూడి వంటి నృత్యాలతో కళాకారులు ఆకట్టుకుంటున్నారు. అలాగే దేవాలయంలో ఉత్సవాల నేపథ్యంలో డప్పు కళాకారులు వాయిద్యాలతో ఆకట్టుకుంటున్నారు.

ఉత్సవాలకు వస్తున్న వేలాది మంది యాత్రికులకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదానంలో భాగంగా అందిస్తున్న ఆహార పదార్థాలు అత్యంత రుచికరంగా, మహాద్భుతంగా ఉన్నాయని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ నిత్యాన్నదాన కేంద్రంలో భోజనం చేసి మరీ ప్రశంసించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.ఎస్.రామరావులతో కలిసి నిత్యాన్నదాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 20వ తేదీన దేవస్థానానికి రానున్న సందర్భంగా సాధారణ యాత్రికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.

ఇంద్రకీలాద్రిపై ప్రభుత్వం పటిష్ట ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉష శ్రీచరణ్ అన్నారు. దర్శనం చేసుకున్న అనంతరం మంత్రి మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు.

20, 21 తేదీల్లో కెఎల్‌యులో సాంకేతిక సదస్సు

ప్రజాశక్తి- ఎడ్యుకేషన్ (విజయవాడ)

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే లక్ష్యంతో కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రతి ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం సమ్యక్‌ను ఈ నెల 20, 21 తేదీల్లో వడ్డేశ్వరంలోని గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్‌లో నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ అన్నారు. విజయవాడలోని పరిపాలన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదస్సుకు దేశవ్యాప్తంగా ఆయా కళాశాలలు, యూనివర్సిటీలకు చెందిన సుమారు 15వేల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. రెండు రోజులు జరిగే ఈ సాంకేతిక సదస్సులో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులతో పాటు విద్యార్థుల ప్రదర్శనలు ఉంటాయన్నారుఏ. సమ్యక్‌కు చైర్మన్‌లుగా డాక్టర్ ఎ.శ్రీనాథ్, డాక్టర్ బి.జయకుమార్ సింగ్, కన్వీనర్‌లుగా డాక్టర్ ఎం.సుమన్, డాక్టర్ టి.పవన్ కుమార్, డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ పి.వెంకటేశ్వర్లు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, కమిటీ సభ్యులు వినయ్ మాట్లాడుతూ ప్రాంతాలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు అనే తారతమ్యం లేకుండా దేశ వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ విద్యార్థులందరూ ఒకే వేదిక మీద జరుపుకునే సాంకేతిక పండుగ సమ్యక్ అని వివరించారు. ఈ కార్యక్రమంలో విసిలు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, చరిష్మ, ఆస్రిత పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గుంటూరు సిటీ

తలకు గాయమై జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న సుమారు 45 ఏళ్ల వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కొత్తపేట సిఐ షేక్ అన్వర్ బాషా తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు రైల్వే స్టేషన్ రోడ్ లోని న్యూ అజంతా లాడ్జి సమీపంలో అర్ధరాత్రి 1 గంటలకు మృతి చెందిన వ్యక్తితో, మరొక వ్యక్తి బ్యాగ్ దొంగిలిస్తున్నాడనే నెపంతో గొడవకు దిగి బండ రాయితో, తలపై బలంగా కొట్టాడు. తలకు బలమైన గాయం కావడంతో రక్తపుమడుగులో యువకుడు పడి ఉన్నాడు. ఈ మేరకు 108 కు సమాచారం అందడంతో జిజిహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న అతను ఉదయం 9 గంటలకు చనిపోయాడు. యువకుడు వివరాలు తొలగిపోవడంతో జిజిహెచ్ లోని శవగారంలో మృతదేహాన్ని ఉంచారు. కొత్తపేట వి.ఆర్.ఓ యన్.సంగీతరావు ఇచ్చిన ఫిర్యాదు తో కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి ఆచూకీ తెలిసినవారు 8688831320, 0863 2221815 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

సాగర్ కాల్వలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-ఈపూరు

నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువలో గల్లంతైన ఆంద్ర ప్రవీణ్ (25) మతదేహాన్ని ఏపీ ఎస్డిఆర్ఎఫ్ రెస్క్యూ బృందం బొల్లాపల్లి మండలం మూగచింతలపాలెం సమీపంలో పంట పొలాలకు వెళ్లే నీటి తూములో ఇరుక్కొని ఉండడాన్ని బుధవారం గుర్తించారు. ఎస్సై షేక్ మొహమ్మద్ ఫిరోజ్ కాలువ వద్దకు చేరుకొని రెవెన్యూ సిబ్బంది సాయంతో బయటకు తీశారు. వైద్యులు పోస్టుమార్టం చేయగా రెవిన్యూ అధికారులు శవ పంచనామా నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడి మృతి

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల పట్టణంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రహదారి ప్రమాదంలో ఒక భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందగా, మరోకరికి తీవ్ర గాయాలైనాయి. ఒంగోలు జిల్లా కనిగిరి సమీపంలోని చౌడారం గ్రామానికి చెందిన షేక్ మౌలాలి, గూడురు ఆనందం కలిసి నిజామాబాద్‌లో భవన నిర్మాణ పనులకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. మార్గమధ్యంలో మాచర్ల పట్టణంలో జరిగిన రహదారి ప్రమాదంలో మౌలాలి మరణించగా, ఆనందంకు తీవ్రగాయాలైనాయి. ద్విచక్ర వాహనంపై వెళుతున్న వారిని ఆర్.టి.సి డిపో సమీపంలో వెనుకగా వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. బండిపై నుండి ఇద్దరు క్రింద పడిపోయినారు. క్రింద పడిన మౌలాలి తలపై నుండి టిప్పర్ వాహనం వెళ్ళి

పోవటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఆనందానికి తీవ్ర గాయాలు అవ్వగా 108 ద్వారా మాచర్ల ప్రభుత్వ వైద్యశాల ద్వారా చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ ఆపకుండా వెళ్ళిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం కాజ గ్రామంలో టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ సమయంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న హోండా సిటి కారును బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఆ కారులో రవాణా చేస్తున్న 62.100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, కారులోని ముగ్గురు వ్యక్తులు కేరళకు చెందిన షిజు, ఎ.శరత్, కాకినాడకు చెందిన బుద్దాల రామకృష్ణను అరెస్టు చేశారు. ఎస్ఈబి సిఐ ఇ. మారయ్య బాబు, మంగళగిరి ఎస్ఈబి ఎస్సై, ఎస్‌టిఎఫ్ ఎస్సై, సిబ్బందితో కలసి మంగళగిరి మండలం కాజ గ్రామంలో టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేస్తుండగా వీరు పట్టుబడ్డారు.గంజాయిని ఒడిస్సా నుండి తీసుకువస్తున్నట్లు సమాచారం. కాకినాడ జిల్లాకు చెందిన రోమాల గణేష్‌పైనా కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

జనసేన కేంద్ర కార్యాలయంపై డ్రోన్ల ఎగరవేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి జనసేన కేంద్ర కార్యాలయానికి జనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వచ్చి నప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు ఈ కార్యా లయంపై డ్రోన్ల ఎగరవేయ డంపై బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జనసేన మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్ల పల్లి శ్రీనివాసరావు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. డ్రోన్లు ఎగుర వేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మంగళగిరి ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మంగళగిరి

ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మంగళగిరి ప్రాజెక్టు కమిటీ గౌరవాధ్యక్షులుగా వేముల దుర్గా రావు, అధ్యక్షురాలుగా కె.తబిద, కార్యదర్శిగా కె.హేమలత, ఉపాధ్యక్షులుగా వి రుక్మిణి, ఎస్.అనూష, సహాయ కార్య దర్శు లుగా ఎం.మధులత, ఎ.పద్మజ, కోశాధికారిగా పి . తిరుపతమ్మ, మరో 11 మందితో కమిటీ ఎన్నిక జరిగింది

16 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళగిరి రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కంకిపాడు కు చెందిన ఉప్పతల నాగేశ్వరరావు ఇంటింటా తిరిగి రేషన్ బియ్యం కొనుగోలు చేసి కోళ్ల ఫారాల నిర్వాహకులకు విక్రయిస్తుంటాడు. ఈ నేపథ్యంలో తాను కొనుగోలు చేసిన 16బస్తాల రేషన్ బియ్యాన్ని బుధవారం ఆటోలో తెనాలికి తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ శివ నాంచారయ్య తన సిబ్బందితో దాడి చేసి ఆటోను సీజ్ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్ కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 24,728
మిర్చి ఎగుమతి	: 25,832
మిర్చి నిల్వ	: 9,112

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 23,500
నెం.5	13,000 - 21,000
273	10,000 - 17,500
341	10,000 - 22,000
4884	21,500 - 21,500
సూపర్ 10	19,500 - 22,500
	నాన్ ఎసి
తేజ	10,000 - 23,700
బడిగి	11,500 - 26,000
దేవనూరు డీలక్స్	18,000 - 22,500
తాలుకాయలు	6,000 -14,500
	ఎసి
334	10,500 - 23,000
నెం.5	15,500 -20,000
341	13,800 - 19,000
4884	11,000 - 21,000
తేజ	13,600 - 23,600
బడిగి	15,500 - 26,000
దేవనూరు డీలక్స్	16,000 - 18,200
తాలుకాయలు	7,200 -13,000

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-తెనాలి

జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు.. స్థానిక ముత్తింశెట్టి వారి పాలెం పట్టణ ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ ఇంచార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పరిశీలించారు. శిబిరంలో రోగులతోను వైద్య బందంతోను మాట్లాడారు. నమోదైన ఓపి వివరాలను వైద్య సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. జనరల్ ఓపి 135మంది, పీడియాట్రిక్స్ ఓపి 53మంది, ఫిజీషియన్ ఓపి 59, ఆప్తమాలజి ఓపి 121 నమోదై నోట్లు వైద్యాధికారి డాక్టర్ డి కిషోర్ కుమార్ తెలి పారు.. శిబిరాన్ని ఎమ్మెల్యే తో పాటు మున్సి పల్ కమిషనర్ ఎం జశ్వంత్ రావు, మున్సి పల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె హెలెన్ నిర్మల పరిశీలించారు.

నేడు గార్లపాడులో 'ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-కాకుమాను

కాకుమాను మండలం పరిధిలోని గార్లపాడులో గురువారం ఉదయం10గంటల కు మండల పరిషత్ పాఠశాలలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని మండల అభివద్ధి శాఖాధికారి పి.రామకృష్ణ తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూ రీసర్వేతో వివాదాలు పరిష్కారం

ప్రజాశక్తి - రెంటచింతల

సమగ్ర భూ రీసర్వే ద్వారా దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న వివాదాలు పరిష్కారమవుతాయని తహశీల్దార్ కె.పుల్లారావు అన్నారు. మండలంలోని రెంటాల శివారు భూముల్లో రీసర్వే పనులను తహశీల్దార్ బుధవారం ప్రారంభించారు. 3920.66 ఎకరాలను 21 రోజుల్లో సర్వే చేస్తామన్నారు. ఒక్కో సర్వే బృందంలో ఒక సర్వేరు, ఇద్దరు విఆర్వోలు చొప్పున మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి ఎన్.భాస్కర్‌రెడ్డి, విఆర్ఒ నాసరయ్య, లింగయ్య, పాపారావు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

గుంటూరు సిటీ, ఏ.టి.అగ్రహారం న్యూ, జూట్‌మిల్లు కాలనీ, రామిరెడ్డి నగర్ కు చెందిన గాదంశెట్టి వెంకట రమణ, తండ్రి గాదంశెట్టి వెంకటేశ్వర్లు (లేటు) నాకు సంబంధించిన దస్తావేజులు గుంటూరు రిజిష్టరు ఆఫీసులో రిజిష్టర్ కాబడిన **దస్తావేజు నెం.6819/1989** దానికి సంబంధించిన **లింకు దస్తావేజు నెం. 3507/1986** మరియు **దస్తావేజు నెం.6818/1989** దానికి సంబంధించిన **లింకు దస్తావేజు నెం. 3509/1986** గల దస్తావేజులను ది.05-08-2023న గుంటూరు జిల్లా, పెదకాకాని నందు జిరాక్స్ నిమిత్తం వెళ్లుచుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. తిరిగి మరల ఎంత వెతికిననూ దొరకలేదు. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

ఇట్లు
గాదంశెట్టి వెంకటరమణ,
డోర్ నెం.26-32-129/145,
జూట్‌మిల్లు కాలనీ, రామిరెడ్డి నగర్,
ఏ.టి.అగ్రహారం న్యూ, గుంటూరు సిటీ,
సెల్ నెం.9581326644

IN THE HIGH COURT OF JUDICATURE FOR THE STATE OF ANDRHA PRADESH: AT AMARAVATHI
A.S.NO. 155 of 2022

Between:
1. Mukkamala Kishore Kumar S/o Panakalu,
2. Mukkamala Mohana Krishna.

... Appellants.(D3 & D4)

AND

1. Revanisetti Padmavathi.
2. Revanisetti Harshavardhan.
3. Revanisetti Ramu.
4. Revanisetti Bhanu Lakshmi Narayana.
5. Boddapati Sudha Krishna.
6. Tadiboina Lakshmi Vara Prasad.
7. Mukkamala Hemachandra.

... Respondents.

To:
1. Revanisetti Padmavathi W/o late Siva Seshagiri Rao. R/o Nazarpet, Tenali, Guntur District.
2. Revanisetti Harshavardhan S/o late Siva Seshagiri Rao, R/o Nazarpet, Tenali, Guntur District.
3. Revanisetti Ramu.S/o late Siva Seshagiri Rao. R/o Nazarpet, Tenali, Guntur District.
4. Revanisetti Bhanu Lakshmi Narayana. S/o late Siva Seshagiri Rao. R/o Nazarpet, Tenali, Guntur District.
5. Boddapati Sudha Krishna. S/o Lakshminarayana, R/o DoorNo. 5-111/1, Uma Sankar Nagar, Kanuru Village, Penamaluru Mandal, Krishna District.
7. Mukkamala Hemachandra S/o Kishore Kumar, Mangalagiri Village & Mandal, Guntur District.

Please take notice that the above FIRST APPEAL was filed by the Appellants before the Hon'ble High Court of Judicature for the State of Andhra Pradesh, at Amaravathi against the Decree and Judgement in O.S.No. 28/20215 on the file of the XI Additional District & Sessions Judge, at Tenali, of Guntur District. The said app eal is stands posted for your appearance on 31.10.2023 at 10.30 AM and to answer the same. If no appearance is made by yourself, on your behalf, your pleader, in the above Appeal on the date and day mentioned hereunder, it will be heard and decided in your absence.

Hearing date: 31.10.2023.

// BY ORDER OF THE COURT //

CH.MARKONDAIAH, B.A.,LL.M.,
Smt.P.Madhavi, B.A.,LL.M.,
Counsel for the Appellants.
Mob: 9440524224, 9441748224.

Vijayawada Dated:17-10-2023

కరువు మండలాలుగా ప్రకటించి ఆదుకోండి

- పాదయాత్రల్లో సిపిఎం నాయకుల డిమాండ్
- పనుల్లేక ఇబ్బంది పడుతున్నామని, రుణాలకు వడ్డీ మాఫీ చేయాలని ప్రజల నుండి విన్నవపాలు

సత్తెనపల్లి మండలం కట్టమూరులో వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ముప్పాళ్ళ మండలంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల

సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాలను కరువు మండలంగా ప్రకటించి రైతులను, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాల కార్యదర్శులు పి.మహేష్, జి.బాలకృష్ణ డిమాండ్ చేశారు. సిపిఎం చేపట్టిన పాదయాత్ర సత్తెనపల్లి మండలంలోని భట్లూరు, గోరంట్ల, కట్టమూరు గ్రామాల్లో, ముప్పాళ్ల మండలంలోని పలుదేవర్లపాడు, నార్నెపాడు గ్రామాల్లో బుధవారం కొనసాగింది. సత్తెనపల్లి మండలంలో పాదయాత్ర బృందానికి ఆయా గ్రామాల్లోని ప్రజలు తమ సమస్యలను వివరించారు. పనుల్లేక ఇళ్ల వద్దే ఉంటున్నామని, మరోవైపు ధరల పెరుగుదలతో కుటుంబ జీవనం కష్టంగా మారిందని పలువురు వాపోయారు. రైతులు, డ్వాక్రా మహిళల రుణాలకు వడ్డీ మాఫీ చేయాలని కోరారు. డ్రెయినేజీ సదుపాయం కల్పించాలన్నారు. అర్హుల్లో కొందరికి పింఛన్లు రావడం లేదని, రైతు భరోసా కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలు అందలేదని పలువురు రైతులు తెలిపారు. వ్యవసాయ పనులు లేని నేపథ్యంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని విన్నవించారు. ఒక్క యూనిట్ విద్యుత్ వాడుకోకున్నా రూ.200 బిల్లు వస్తోందని, విద్యుత్ ఛార్జీల భారం తగ్గించాలని పలువురు కోరారు. జగనన్న కాలనీల్లో ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ఇంకా జారీ చేయలేదని, కార్డులున్నవారికి సంక్షేమ బోర్డు నుండి నిధులు రావడంలేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి బిల్లులింకా మంజూరు కాలేదన్నారు. ఈ సమస్యలన్నింటిపైనా అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని, లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు టి.పెద్దిరాజు, వి.తులసిరామ్, ఆర్.పూర్ణ చంద్రరావు, అమూల్య, కె.సాయికుమార్, డి.తాతారావు, వి.కోటేశ్వరరావు, సుజాత, అనూష, లక్ష్మి, సత్యవతి, బి.వెంకటేశ్వర్లు, సుబ్బారావు, గణేష్ పాల్గొన్నారు.

ముప్పాళ్ల మండలంలో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరుయాత్ర బుధవారం నాలుగో రోజుకు చేరింది. ఏపూరి గోపాలరావు, జి.బాలకృష్ణ మాట్లాడుతూ సాగర్ ఆయకట్టులో నీటి విడుదల లేకపోవడంతో పంటల్లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొందరు రైతులు ఆడపాదడప వర్షాలతోనే మిర్చి, పసుపు సాగు చేశారన్నారు. వీరితోపాటు మొక్కజొన్న ఇతరత్రా పంటలు సాగు చేసేందుకు ఎదురు చూస్తున్న రైతుల పరిస్థితి డోలాయమానంగా మారిందని, ఈ నేపథ్యంలో నీటి విడుదలపై ప్రభుత్వం ప్రణళిక సిద్ధం చేసి నీటిని విడుదల చేయాలని కోరారు. మండలాన్ని కరువు మండలంగా గుర్తించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జి.జాలయ్య, కె.సాంబశివరావు, కె.ప్రభాకర్, ఎన్.సాంబశివరావు, ఐ.లింగయ్య, శ్రీను, ఎం.వెంకటరెడ్డి, కె.నాగేశ్వరరావు, పి.సైదాఖాన్, సిహెచ్.నాగమల్లేశ్వరరావు, ఐ.సత్యనారాయణరెడ్డి, వెంకటరెడ్డి, టి.బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పుస్తకాలను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

సెలవుల్లో పుస్తకాలు చదవండి

విద్యార్థులకు పల్నాడు కలెక్టర్ సూచన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పుస్తక పఠనం ద్వారా అమితమైన జ్ఞానం సొంతమవుతుందని, యువతంతా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం మోర్ సెంటర్‌లో విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనను కలెక్టర్, అరసం రాష్ట్ర నాయకులు కొమ్మాలపాటి శరత్చంద్ర బుధవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ దసరా సెలవుల్లో యువత సెల్‌ఫోన్, కంప్యూటర్‌లతో సమయం వృథా చేయకుండా పుస్తకాలు చదవాలని సూచించారు. పుస్తక పఠనాన్ని పిల్లలకు తల్లిదండ్రులు అలవర్చాలన్నారు. కార్యక్రమంలో వై.చెంచయ్య, ఎం.మల్లికార్జునరావు, సిహెచ్.ప్రతాప్, డాక్టర్ గౌతమి, తదతరులు పాల్గొన్నారు.

ఎస్సీ మహిళల పట్ల కన్నా వివక్ష : వైసిపి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

దళిత మహిళల పట్ల టిడిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ వివక్ష చూపారని వైసిపి ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షులు చిలుకా జయపాల్ అన్నారు. ఈ మేరకు బాధిత మహిళలతో కలిసి స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. బాధిత మహిళ మాట్లాడుతూ ధూళిపాళ్లలో ఉంటున్న తాను రాత్రివేళ ఇంట్లో నిద్రిస్తుండగా గోలమాల ప్రభుదాస్ అగాయత్నానికి యత్నించాడని, ప్రతిఘటించిన తాను రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని చెప్పారు. అయితే ఈ ఘటనకు కన్నా లక్ష్మీనారాయణ రాజకీయాలు ఆపాదించారని, ఇది తనను అవమానించడమేనని అన్నారు. యార్డుచైర్మన్ పి.బాబురావు మాట్లాడుతూ ఘటనతో సంబంధం లేని మంత్రి అంబటి రాంబాబుపై కన్నా లక్ష్మీనారాయణ, మాల మహానాడు నాయకులు చౌకబారు విమర్శలు చేయటం సరికాదన్నారు. నిందితులనే వారు వెనకేసుకురావడం విడ్డూరంగా ఉందన్నారు.

కుక్కల్లో సంతాన నియంత్రణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాల్లో కుక్కల కాటుకు గురయ్యే వారి సంఖ్య రోజుకు పెరుగుతోందని, కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు సర్పంచులు చర్యలు చేపట్టాలని ఎంపిపి డి.చౌడేశ్వరి కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో బుధవారం నిర్వహించగా ఎంపిపి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పని దినాలు పెంచడంతోపాటు పని జరిగే చోట తప్పనిసరిగా సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ గురించి వివరించారు. సమావేశంలో ఎంపిడిఒ మహాలక్ష్మి ఎంపిటిసిలు సంపూర్ణమ్మ, శౌరెడ్డి ప్రతాపరెడ్డి, డానియేలు, నాగలక్ష్మి, కార్యదర్శి కోటేశ్వరరావు, పిఆర్ డిఈ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ నరేంద్రరెడ్డి, సర్పంచులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయం కోసం మహాపాదయాత్ర

ప్రజాశక్తి - యడ్లపాడు

మరో గ్రంథాయల ఉద్యమంలో సమాజ భాగస్వామ్యం కోసం నిర్వహిస్తున్న మహాపాదయాత్ర మండల కేంద్రమైన యడ్లపాడుకు బుధవారం చేరింది. యాత్రకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాషువా కళా కేంద్రం బాధ్యులు ఎన్.కాళిదాసు ఆధ్వర్యంలో బాలలు, పెద్దలు స్థానిక వీధుల్లో ప్రదర్శన చేశారు. గ్రంథాలయాలు, విజ్ఞాన కేంద్రాల ఆవశ్యకతపై ప్లకార్డులను ప్రదర్శించారు. పాదయాత్ర బృందం బాధ్యులు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో పుస్తకాలను అందరూ చదివేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పాదయాత్ర పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి రామిరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో యడ్లపాడు గ్రంథాలయాధికారి సిహెచ్ అంజమ్మ, నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల హెచ్‌ఎం సిహెచ్ సృజన, సుధాకర్‌రావు, ఎన్.విజయలక్ష్మి, పి.సంజీవరావు, ఎం.కృష్ణ, జె.శంకరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజీనామా ఉపసంహరణ

మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ చిన్నమ్మాయి ప్రకటన

ప్రజాశక్తి - రొంపిచర్ల

విలేకర్లతో మాట్లాడుతున్న యార్డు చైర్‌పర్సన్ చిన్నమ్మాయి

తన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బత్తుల చిన్నమ్మాయి ప్రకటించారు. ఈ మేరకు స్థానిక యార్డు కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డిపై ఉన్న గౌరవంతో రాజీనామాను ఉపసంహరించుకుంటున్నామని చెప్పారు. గత నెల 22న సంతగుడిపాడులో వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా జరిగిన గొడవల్లో టిడిపి నాయకులు మంజుల ఆంజనేయులు, అతని భార్య మాజీ సర్పంచ్ అంజనీకుమారి, కుమార్తె సౌజన్యపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నట్లుగా వారు ఆరోపిస్తున్నారని, అందులో వాస్తవం లేదని అన్నారు. వారిని వైసిపిలోకి రావాలని ఒత్తిడి చేస్తున్నట్లు చెబుతున్నారని, ఆ దుస్థితి వైసిపికి లేదని, ప్రభుత్వ చేస్తున్న అభివృద్ధి పనుల వల్లే అనేక మంది పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యేపై వారు చేసిన ఆరోపణలను వెనక్కు తీసుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

లిఫ్టు ఇరిగేషన్ కమిటి ఏర్పాటుపై సమావేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఃఅచ్చంపేట మండలం కోనూరు చంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ సొసైటీ ప్రత్యేక సమావేశం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షత వహించి సభ్యులతో మాట్లాడారు. రైతులు లేవనెత్తిన సమస్యలపై శుక్రవారం మరోసారి సమావేశం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, సత్తెనపల్లి ఆర్‌డిఒ రాజకుమారి, అచ్చంపేట తహశీల్దార్ పద్మావతి ఇఇ శంకర్, రైతులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా అచ్చంపేట మండలంలోని గ్రంథసిరి, కోనూరు, క్రోసూరు మండలం ఊటుకూరు గ్రామాల్లో పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర వాణిజ్య పంటల సాగుకు అనుకూలంగా ఉండే ప్రాంతంలో 360 మంది రైతులకు చెందిన సుమారు 2500 ఎకరాలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన కోనూరు చంద్రలిఫ్ట్ ఇర్రిగేషన్ ద్వారా నీరు సరఫరా అవుతోంది. లిఫ్ట్ ఇర్రిగేషన్ నిర్వహణకు సొసైటీ ఉంది. అయితే ఈ కమిటీలో కీలకంగా వ్యవహరించే వ్యక్తి ఇటీవల మృతి చెందడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలిక కమిటీని అధికార పార్టీకి చెందిన వారితో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. టిడిపికి చెందిన రైతులు దీనిపై అభ్యంతరం చెబుతూ కలెక్టర్‌ను కలిసి ఎన్నికలు నిర్వహించాలని కోరారని తెలిసింది.

పాలస్తీనా భూభాగంపై దాడులు నిలిపివేయాలి : ఎమ్మెల్సీ కెస్

మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

హమాస్ చేసిన దాడు లకు ప్రతిగా పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గమైన, అమానుషమైన దాడులను తక్షణమే నిలిపివేయాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. గుంటూరు స్టడీ సర్కిల్ అధ్వర్యంలో 'పాలస్తీనా సమస్య - పరిష్కారాలు' అనే అంశంపై బుధవారం బ్రాడీపేట 2వ లైనులోని సిఐటియు కార్యాలయంలో స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఎల్.ఐ.సి ఎంప్లాయీస్ యూనియన్ సంయుక్త కార్యదర్శి వి.వి.కే.సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ పశ్చిమాసియాపై తన ఆధిపత్యాన్ని కొనసాగించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా మరోసారి కుట్రలు చేస్తోందని, పైగా గాజాతో సహా మొత్తం పాలస్తీనాను కైవసం చేసుకునేలా ఇజ్రాయిల్‌ను పురిగొల్పుతుందని అన్నారు. ఇజ్రాయిల్ మిలిటరీ బలగాలు గాజా ప్రాంతంలో విధ్వంసం సృష్టిస్తున్నాయని, చిన్న పిల్లలతో సహా గత 10 రోజుల్లో సుమారు 3000 మంది సాధారణ పౌరులు మరణించినట్లు తెలిపారు. పాలస్తీనా ప్రజల హక్కులను గౌరవించాలని, గాజా ప్రాంతంలో తక్షణమే శాంతి నెలకొనేలా చర్యలు చేపట్టాలని, ఇజ్రాయిల్ తాను ఆక్రమించుకున్న ప్రాంతాలను తిరిగి పాలస్తీనాకు ఇచ్చేసేలా అంతర్జాతీయ సమాజం తన కషిని పెంచాలని ఆయన అన్నారు.గాజాలోని సామాన్య ప్రజలకు ఆహారం, మంచినీరు వంటి ముఖ్యమైన సదుపాయాలను కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఇంజినీర్ జి.వెంకటరావు, అవధానుల హరి, వై. నేతాజీ, ఎమ్.రామకృష్ణ, కె. నళినీకాంత్, ఎమ్.ఎ.చిష్టి , బి. ప్రసాద్, ఎమ్.సాంబశివరావు పాల్గొన్నారు.

మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారం

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

మండల స్థాయిలోనే ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి ప్రజలకు మరింత త్వరితగతిన, మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం వట్టిచెరుకూరు మండల కేంద్రంలోని, జెడ్పీ జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి , గుంటూరు ఆర్‌డిఓ ప్రభాకర రెడ్డితో కలసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వట్టిచెరుకూరు మండల ప్రజలు 41 దరఖాస్తులను అందించారు. అందిన దరఖాస్తులు ఆన్లైన్ లో నమోదు చేయటం జరుగుతుందని , వాటిని అధికారులు పరిశీలించి సహేతుకంగా పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా చర్యలు గైకొంటున్నదని తెలిపారు. పెండింగ్ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగు సూచనలు జారీ చేయడం జరుగుతున్నదని, ప్రజల నుండి అందిన సమస్యల ఫిర్యాదులను అధికారులు పరిష్కరించడంలో మరింత చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అధికారులను కోరారు.కార్యక్రమంలో డీఆర్డీఏ,

డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు హరిహర నాథ్, యుగంధర్ కుమార్, మండల ప్రత్యేక అధికారి గోపీకష్ణ, డీడీ సోషల్ వెల్ఫేర్ మధుసూధన రావు, డిఇఓ శైలజ, డియం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రావణ బాబు, డిపిఓ కేశవ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హై లెవెల్ ఛానల్ పోరాట కమిటీ సమావేశం

ప్రజాశక్తి - దుగ్గిరాల

హై లెవెల్ ఛానల్ పోరాట కమిటీ సమావేశం స్థానిక టర్మరిక్ అసోసియేషన్ హాలులో భీమవరపు అమ్మిరెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగినది. సమావేశంలో మండలంలోని హై లెవెల్ ఛానల్ కింద సాగు రైతుల సమస్యలను గురించి చర్చించారు. నిర్మాణం పూర్తి నట్లయితే మండలంలోని పంట పొలాలకు నీరు అందించటానికి ఎటువంటి ఆటంకం ఉండేది కాదని ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కాంట్రాక్టర్‌లకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వలన ఇటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు.వారికి బకాయి ఉన్న రూ.కోటి తక్షణం చెల్లించి పనులు పూర్తి చేసి పంట పొలాలకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న రైతులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అందులో ప్రత్యేక కార్యాచరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్, హై లెవెల్ ఛానల్ పోరాట కమిటీ కన్వీనర్ ములక శివ సాంబిరెడ్డి నాయకులు జెట్టి బాలరాజు, ఎన్ యోగేశ్వరరావు, వై బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించండి

ఈఈకి కాంగ్రెస్ పార్టీ వినతి

ప్రజాశక్తి -తెనాలి

కృష్ణా వెస్టర్న్ డెల్టా పరిధిలో రైతులు సాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారని తక్షణమే సాగునీరు అందించాలని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు కోరారు. స్థానిక మారిసుపేట లోని పార్టీ కార్యాలయంలో సమావేశం అనంతరం ఇరిగేషన్ కార్యాలయంలో ఈఈ ఎస్.మల్లిఖార్జునకు సాగునీటి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఈ ప్రాంతంలో రైతులు అత్యధికంగా వరి పండిస్తారని, ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉన్న నేపథ్యంలో నీరు అవసరమన్నారు. ప్రస్తుతం పెట్టుబడులకు తోడు అదనంగా విద్యుత్ మోటారులతో సాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే సాగునీరు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి నాగ సూర్య శశిధర రావు, కె.బుల్లయ్య , శివకుమార్, స్టీవెన్ బాబు, పాల్గొన్నారు

పదిరోజుల్లో సమస్య పరిష్కరించాలి

ముఖ్యమంత్రి,ఎమ్మెల్యే కార్యాలయాలు ముట్టడి

ప్రజాశక్తి దుగ్గిరాల

పది రోజుల్లో హై లెవెల్ ఛానల్ పనులు పూర్తి చేసి రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందించలేని పక్షంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి కార్యాలయాలను రైతులతో కలిసి ముట్టడి చేస్తామని తెలుగుదేశం పార్టీ మండల ఎంపీటీసీలు హెచ్చరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం హై లెవెల్ ఛానల్ కింద సాగు చేస్తున్న రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. ఈ ప్రాంతంలో రైతులు వ్యవసాయం మానేసి కూలి పనులు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని రైతులను ఆదుకోవాలని అన్నారు. తెలుగుదేశం పార్టీ హై లెవెల్ ఛానల్ ప్రారంభించి 80 శాతం పనులు పూర్తి చేశారని ఇంకా 20 శాతం మిగిలి ఉండగా ప్రభుత్వం మారిందని, ఆ 20శాతం పనులు పూర్తి చేయకుండా పొలాలను ఎండగడుతున్నారని దుయ్యబట్టారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రైతులను గురించ గురించి ఎక్కడ నోరు విప్పని పరిస్థితి సోషల్ మీడియాలో దుష్ప్రచారం కోర్టులలో అక్రమ కేసులతోనే ఆయనకు సరిపోతుందన్నారు. బుధవారం మండల కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆరు నెలల క్రితం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభివృద్ధి పథకాలను గురించి అధికారులకు విన్నియించగా నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారని, సమస్య పరిష్కరించకపోతే ఎంపీడీవో కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత ఎంపీటీసీలు పుతుంబాక సాయి కృష్ణ రోజా మరియమ్మ షేక్ జబీన్ పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెట్‌కు డాక్టర్ వై.షేక్ సన్మానం

ప్రజాశక్తి - గుంటూరు

ఇటీవల నిర్వహించిన 35వ మలేషియా ఇంటర్నేషనల్ ఓపెన్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో రెండోస్థానంలో నిలిచిన మాస్టర్ అథ్లెట్ వి విజయను నేషనల్ లివర్ అండ్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ వై.షేక్ బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరుకు చెందిన మాస్టర్ అథ్లెట్ వి.విజయ వెటరన్ అథ్లెటిక్స్ పోటీల్లో 1500 మీటర్ల విభాగంలో విజయ రెండో స్థానంలో నిలవడం దేశానికే గర్వకారణమన్నారు. విజయ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

విజయను సత్కరిస్తున్న డాక్టర్ వై.షేక్ తదితరులు

డాక్టర్ షేక్ నాగూర్ బాషాకు అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సామాజిక సేవా దక్పథ్యంతో క్లిష్టమైన శస్త్ర చికిత్సలను అత్యాధునిక పద్ధతిలో డాక్టర్ నాగూర్ బాషా విజయ వంతంగా నిర్వహించారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఇటీవల ఢిల్లీలో ప్రముఖ క్రికెట్ లెజెండ్ సునీల్ గవాస్కర్ చేతుల మీదుగా గ్లోబల్ హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న సందర్భంగా డాక్టర్ నాగూర్ బాషను బుధవారం డాక్టర్ కిరణ్ కుమార్ అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శస్త్ర చికిత్స లను విజయవంతంగా నిర్వహిఒచి ప్రభుత్వ ఆసుపత్రికి ప్రత్యేక గుర్తింపు తీసుకు వచ్చారని ఆయన కొనియాడారు. సివిల్ సర్జన్ ఆర్ యం ఓ డాక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

కిట్స్‌లో అమృత్ కలశ్ యాత్ర

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు అమృత్ కలశ్‌యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు కళాశాల నుండి వింజనంపాడు వరకూ ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజల నుండి కొంత మట్టి, ధాన్యపు గింజలను అమృత్ కలశ్‌కు సేకరించారు. దీనిని కాకినాడ జెఎన్‌టియు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ద్వారా కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖకు అందించటం జరుగుతుందని నెహ్రూ యువకేంద్రం డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ కిరణ్మయిదేవిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిపాల్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ కె.చంద్రారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాల కోసం ఎఐ డ్రైవ్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ఇంటెంట్ డ్రివెన్ జాతీయ స్థాయి కంపెనీ ప్రొఫెషనల్ రిక్రూట్ చేసుకునేందుకుగాను ఎఐ డ్రైవ్‌ను నిర్వహిస్తుందని సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధి ఈశ్వర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సంస్థల మధ్య కస్టమర్ పరిస్కారాలను, కాంటాక్ట్ సెంటర్ సర్వీస్‌లను ఈసంస్థ అందిస్తుందని తెలిపారు. ప్రస్తుతం బెంగుళూరు, హైదరాబాద్ కేంద్రాలుగా రిక్రూట్ చేసిందని అయితే టైర్ -2 నగరాలైన విజయవాడ, గుంటూరు, విశాఖ లక్ష్యంగా ప్రొఫెషనల్స్‌ను రిక్రూట్ చేస్తున్నట్లు తెలిపారు. వీటికి సంబంధించిన వివరాలకు ఎఐ డ్రైవ్ ఇంటెంట్ డ్రివెన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

175 స్థానాల్లోనూ కాంగ్రెస్ పోటీ : రుద్రరాజు

ప్రజాశక్తి-నందిగామ: రాష్ట్రంలో 175 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. బుధవారం నందిగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. డిసిసి అధ్యక్షులు బొర్రా కిరణ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకీ ప్రజాదరణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాలేటి సతీష్, బొబ్బిలపాటి గోపాలకృష్ణ, సాయి రేపాల రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఈపూరు గ్రంథాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు శాఖ గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కందుల ఝాన్సీ లక్ష్మి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. దసరా సెలవులు నేపథ్యంలో విద్యార్థులకు 'చదవటం మాకు ఇష్టం' కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించారు. గ్రంథాలయంలో విద్యార్థులతో ఆమె ముచ్చటించారు. అందుబాటులో ఉన్న పుస్తకాలను పరిశీలించారు. అనంతరం కథలు చెప్పడం,చెస్,క్యారమ్స్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రోసూరులో 28న మెగా జాబ్‌మేళ

500 ఉద్యోగాలకు ఎంపికలు చేపట్టనున్న కంపెనీలు

ప్రజాశక్తి - క్రోసూరు

ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన క్రోసూరులోని జెడ్‌పి పాఠశాలలో ఈనెల 28న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని ఎమ్మెల్యే ఎన్.శంకరరావు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను గుంటూరులోని తన నివాసంలో అధికారులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, హెటిరో డ్రగ్స్, స్కిల్ క్రాఫ్ట్, మదర్సన్ సుమీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, యొకోహమా, జయలక్ష్మీ ఆటోమోటివ్స్ తదితర 15 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని 500కు పైగా ఉద్యోగాలకు ఎంపికలు చేపడతాయని చెప్పారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ చదివన వారు హాజరవ్వొచ్చని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 28వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నమోదు చేసుకుని ఇంటర్వ్యూ లకు హాజరవ్వాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ కె.సంజీవరావు, ఎడిఎస్‌డిఒ రామాంజనేయులు, డిపిఒ రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ఉత్సవాలు

ప్రజాశక్తి-మాచర్ల

స్థానిక శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని బుధవారం శ్రీ గాయత్రీ దేవిగా అలంకరణ చేశారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ వాసవీ అమ్మవారి దేవాలయంలో, శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో, శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి దేవాలయంలో, నెహ్రునగర్‌లో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయాల్లో అమ్మవార్లను అలంకరించారు. పలు దేవాలయాల్లో మహిళలు బతుకమ్మలను ఏర్పాటు చేసి ఆట, పాటలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో ఆయా దేవాలయాల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరంలో కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక సుబ్బయ్యతోటలోని అర్బన్ హెల్త్ సెంటరులో జరుగుతున్న జగనన్న అరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులతో ఆయన మాట్లా డారు. అనంతరం బంగారుతల్లి పథకము గురించి కలెక్టర్ మాట్లాడుతూ రక్తహీనత రహిత రాష్ట్రంగా మార్చేందుకు ఈ పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. యుక్తవయస్సులో, చాలా మంది బాలికలు రక్తహీనతతో బాధపడు తున్నా రన్నారు. ఈ పథకంలో భాగంగా ఈ ఏడాది ప్రారంభంలో జిల్లా ఐసీడీఎస్ అధికారులు నిర్వహిం చిన గ్రౌండ్ లెవల్ సర్వేలో పదిహేనేళ్లలోపు 7,322 మంది బాలికలకు రక్తహీ నత ఉన్నట్లు తేలిందన్నారు. నిపుణులతో చర్చించి ఈ పథకముపై సమీక్షించినట్లు చెప్పారు. బంగారు తల్లి కార్డులు త్వరితగతిన పంపిణీ చేయలని మండల విద్యాధికారి ఆదేశించారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్ జి. సుజాత,డి.ఈ.రమణ టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ కే సునీత వైద్యులు రెవెన్యూ సిబ్బంది ఎన్ ఎం సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది మున్సిపల్ ఉన్నతాధికారులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

దొడ్లేరులో ఆరోగ్య సురక్ష శిబిరం

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని దొడ్లేరు-2 సచివాలయ పరిధిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి పి.కోటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జెడ్‌పిటిసి జమీల గఫూర్, ఎంపిటిసిలు కె.నాగయ్య, షేక్ వేల్పురి మేరావలి, సర్పంచ్ ఎం.అంజలి గోపి, డాక్టర్లు సిరి చందన, కె.శ్రీనివాస్, ప్రవీణ్, బాల అంకమ్మ బాయ్, శివ సాంబశివరావు, పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

ప్రజాశక్తి -కారంపూడి

మండలం లోని ఒప్పిచర్ల గ్రామ సచివాలయం - 2 పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి వైద్య సహా యం అందించాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జిల్లాస్థాయిలోనే విశేష స్పం దన లభించిందని మండల వైద్యాధికారి డాక్టర్ బత్తుల. దుర్గారావు తెలిపారు. మండల వైద్యాధికారి బత్తుల. దుర్గారావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి 913 మంది హాజరైనట్లు దుర్గారావు తెలిపారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ నాయక్ తో పాటు ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, కంటి వెలుగు వైద్య నిపుణులు, ఎఎన్ ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలోని సుబ్బయ్యతోటలోని వైద్య శిబిరంలో కలెక్టర్ ఎల్.శివశంకర్

కారంపూడిలో వైద్యశిబిరానికి హాజరైన ప్రజలు

రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతి నిధులతో ఓటరు నమోదు అధికారి జి.వసంత బాబు అధ్యక్షతన బుధవారం నాడు సమావేశం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎస్ఎస్ఆర్-2024 లో భాగంగా గత వారం 10వ తేదీ నుండి ప్రస్తుతం వరకు జరిగిన ఓటర్ల జాబితా దం ఖాస్తులు, అభ్యంతరాలు, చేర్పులు,తొలగింపులు,సవరణల గురించి, ఈ వారపు ఓటర్ల జాబితా తాజాపరచడం, రేషన లైజేషన్‌పై వివిధ రాజకీయ పార్టీలు సమర్పించిన అర్జీల గురించి చర్చించారు. తెలుగుదేశం పార్టీ తరఫున కోనేరు సురేష్ ఎన్నికల కమిషనర్‌కు సమర్పించిన అర్జీలోని అం శాలు మరణించిన వారి, శాశ్వతముగా వలస వెళ్ళిన, డూప్లికేట్, నకిలీ ఓట్లు, అనవసరముగా తొలగించిన ఓట్ల పున రుద్ధరణ గురించి చర్చించారు. ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా ప్రిరివిజన్,హెచ్2హెచ్ సర్వే,మరణాలు, నకిలీ, బదిలీ ఓటర్లు, గత ఏడాది జనవరి 6 నుండి ప్రస్తుతం వరకు ఫామ్-7 ద్వారా తొలగించ బడిన ఓటర్లను సంబం ధిత బూత్ స్థాయి అధికారులు మళ్లీ రీ వెరిఫికేషన్ చేసి నివేదిక ఇవ్వాలిందిగా కోరినట్లు చెప్పారు. పోలింగ్ స్టేషన్ల రేషన లైజేషన్ గురించి అన్ని రాజకీయ పార్టీలతో చర్చిం చామని, ఇతర అంశాల గురించి రాజకీయ పార్టీల నాయ కుల వద్ద నుంచి సూచనలు, సలహాలను స్వీకరించినట్లు చెప్పారు. కార్యక్రమలో అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీ సర్లు, చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ సి. హెచ్. గోవిందరావు, వైసిపి, టిడిపి, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, బిజెపి, జనసేన, నవతరం పార్టీల నుంచి వరుసగా విడదల శేషగిరి,షేక్ అజారుద్దీన్, ఎం.ప్రసన్న, పేరుబోయిన వెంకటేశ్వర్లు, ఆర్. సుబ్బాయమ్మ, పి.బ్రహ్మా నందం, షేక్ సుభాని,షేక్ షమ్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఓటరు నమోదు అధికారి జి.వసంత బా బు

రాయితీపై రైతులకు శనగలు పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ

ప్రత్యామ్నాయ పంటలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం రాయితీతో శనగలను రైతు భరోసా కేంద్రాల ద్వారా పారదర్శకంగా రైతులకు అందజేస్తున్నామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని వేల్పూరు రైతు భరోసా కేంద్రంలో శనగల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతన్నను రాజును చేసిన ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని, వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎప్పుడు రైతులకు అండగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందచేసే శనగలు ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎఓ రామినేని రామారావు మాట్లాడుతూ మండలానికి 43 టన్నులు శనగలు మంజూరు అయ్యాయని వాటిని వేల్పూరు రైతు భరోసా కేంద్రంలో 30 టన్నులు, పొట్లూరు రైతు భరోసా కేంద్రంలో 5 టన్నలు, కారుమంచి రైతు భరోసా కేంద్రంలో 5 టన్నులు, మతుకుమల్లి రైతు భరోసా కేంద్రంలో 3 టన్నుల శనగలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్వింటా శనగలు రూ.8100 ఉండగా 40 శాతం రాయితీ పోను రైతులకు క్వింటా రూ.4860కు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, వైసిపి నాయకులు స్వర్ణాల వెంకట్రావు, తుమాటి కబ్బారావు, ముంద్రు సాంబశివరావు, లింగా శ్రీనివాసరావు, ముంద్రు రాఘవరావు, మారిశెట్టి ప్రసాద్, ఆలపాటి సాంబశివరావు, గట్టుపల్లి వీరాస్వామి, స్వర్ణాల నాగేశ్వరరావు, బొల్లికొండ బ్రహ్మనందం, ఎఈఓ పూరేటి ఆశోక, పంచాయతీ కార్యదర్శులు కోమటినేని అశోక్ చౌదరి, ఆళ్ళ యుగంధర్, ఎంపిఈఓ రేగళ్ళ హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

శనగల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

ముగిసిన ఖో-ఖో శిక్షణ

ప్రజాశక్తి-ఈపూరు

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైన జూనియర్, సబ్ జూనియర్ జట్లకు మండల కేంద్రమైన ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ బుధ వారం ముగిసినట్లు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ విభాగంలో 15 మంది, సబ్ జూనియర్ విభాగంలో 20 మంది విద్యార్థులకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎ వీరాంజనేయులు, ఎం.వెంకటేశ్వర్లు 10 రోజులపాటు ఆటలో మెలకువ లతో కూడిన శిక్షణ ఇచ్చారన్నారు. .విద్యార్థులు ఈనెల 20, 21, 22వ తేదీలలో చిత్తూరు జిల్లాలోని రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలలో ఆడతారని అన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
గురువారం 19 అక్టోబర్ 2023

శిథిలావస్థలో ప్రభుత్వ వైద్యశాల

నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - మంగళగిరి

శిథిలావస్థకు చేరిన మంగళగిరి ప్రభుత్వ వైద్యశాల స్థానంలో రూ.12 కోట్ల వ్యయంతో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణబాబుకు అందజేస్తామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చెప్పారు.మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలలో ఎక్స్ రే పరికరం చెడిపోయిందని గత 20 ఏళ్లుగా మరమ్మతులకు నోచు కోవడం లేదంటూ సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై ఎమ్మెల్యే స్పందించారు. ప్రభుత్వ వైద్యశాలలోని ఓ ఛాంబర్ లో ఉన్న ఎక్స్-రే పరికరాన్ని బుధవారం పరిశీలించారు. అంతర్గత రహదారులను సందర్శించి ఆసుపత్రి అభివృద్ధిపై వైద్యులతో చర్చించారు. వైద్యశాలలో నూతన ఎక్స్ రే పరికరం కొనుగోలుకు అంచనాలు తయారు చేసి ప్రభుత్వం నుండి ఆమోదం తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, మాజీ మంత్రి ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు హయాంలో 1986లో నిర్మించిన ప్రభుత్వ వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరిందని, దీనిని కూల్చివేసి నూతన భవన నిర్మాణానికి తగు చర్యలు తీసు కుంటానని హామీ ఇచ్చారు. నూతన ఎక్స్-రే యంత్రం కొను గోలుకు రూ.30 నుండి రూ.40 లక్షలు అవసరమని, ఇందుకు ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకొస్తామని చెప్పారు.

మార్చురీ బాక్స్ కోసం రూ.50 వేలు ఇచ్చిన ఎమ్మెల్యే

డిఎంఇ పరిధిలో ఉన్న ఈ వైద్యశాలలో మార్చురీ బాక్స్ లేదని, అంతర్గత రహదారులు లేవని, లైట్లు లేవని, చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ స్పందన లేదని, ఆసుపత్రికి అభివృద్ధి కమిటీ కూడా లేదని ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ గీతా పద్మజ ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మార్చురీ బాక్స్ కొనుగోలుకు రూ.50 వేల నగదును అందజేశారు. ఆసుపత్రి ముఖద్వారం నుండి ఒపి ఛాంబర్ వరకు, అక్కడి నుండి మార్చురీ వరకు సిసి రోడ్డు నిర్మాణం చేయాలని, వెంటనే పనులను ప్రారంభించాలని కార్పొరేషన్ డిఇ కృష్ణారెడ్డికి సూచించారు. ఆస్పత్రిలో జంగిల్ క్లియరెన్స్ చేయించాలని, పొక్లెయిన్‌తో పనులు ప్రారంభించాలని, మొత్తం 5 సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంపై డాక్టర్ గీతా పద్మజ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గంజి చిరంజీవి, డాక్టర్ స్నేహ రాజ్ పాల్గొన్నారు.

మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సి హనుమంతరావు తదితరులు

మాస్టర్ ప్లాన్ ప్రకారమే తెనాలి రోడ్డు విస్తరణ

గత 2006లో ఉడా రూపొందించిన మాస్టర్ ప్లాన్ ప్రకారమే తెనాలి రోడ్డు విస్తరణ చేపట్టడం జరుగుతుందని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కోరారు. ఎమ్మెల్సీ హనుమంతరావుతో పాటు నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఎమ్మెల్యే బుధవారం తెనాలి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్కే మాట్లాడుతూ నగరంలోని రాజీవ్ సెంటర్ నుంచి మిద్దె సెంటర్ వరకు 60 అడుగులు, మిద్దె సెంటర్ నుంచి గౌతమ బుద్ధా రోడ్డు వరకు 40 అడుగులుగా మాస్టర్ ప్లాన్ లో ఉందన్నారు. కార్పొరేషన్‌కు భారం లేకుండా ప్రజలకు ఇబ్బందిగా కలగకుండా తెనాలి రోడ్డును విస్తరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, ఏసీపీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

26న బస్సుయాత్రను జయప్రదం చేయండి

ఎంపి అయోధ్యరామిరెడ్డి

ప్రజాశక్తి-తాడికొండ

రానున్న సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికలలో వైసీపీదే అధికారమని రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ లోని శిరిడి సాయిబాబా కళ్యాణ మండపం ఆవరణలో బుధవారం వైసిపి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అయోధ్య రామిరెడ్డి మాట్లాడారు ఈనెల 26న తెనాలిలో బస్సు యాత్ర ప్రారంభం అవుతుందన్నారు తాడికొండ నియోజకవర్గంలో జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. 2019లో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నాలుగున్నరేళ్ల కాలంలో 99 శాతం పూర్తి చేశామని చెప్పారు. ప్రభుత్వం చేసిన పనులను ప్రజలలోకి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఐదు నెలలు వైసిపి నాయకులు కష్టపడి పనిచేయాలని చెప్పారు. వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశ పెట్టిందని, దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని సంక్షేమ పథకాలు అమలు కాలేదని అన్నారు.

రిజర్వాయర్లలో నీటిని జాగ్రత్తగా వినియోగిస్తున్నాం

ప్రజాశక్తి-దుగ్గిరాల

ఈ ఏడాది ముప్పై ఐదు శాతం వర్షపాతం తక్కువ అని, అందు వలన రిజర్వాయర్లలో నీరు సక్రమంగా లేదని, ఉన్న నీటిని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకుంటూ డెల్టా చివరి భూములకు నీరు అందేటట్లు చూస్తున్నట్లు జల వనరుల శాఖ డి ఈ ఎన్ కె వి ప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ డి.సంతోష్ రూపవాణి అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. హై లెవెల్ ఛానల్ సమస్యపై అనేకమంది సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు ఈ సమస్యకు ఆయన సమాధానం చెబుతూ రిజర్వాయర్లలో నీటి విలువలు తక్కువగా ఉన్నాయని పంట ఎండిపోకుండా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కలెక్టర్ సొంత నిధులతో హై లెవెల్ ఛానల్ పనులు పూర్తి చేస్తామన్నారని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన వివరాలను తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఎం అరుణ ఎంపీడీవో కె.శ్రీదేవి తహశీల్దార్ కె.మల్లేశ్వరి వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించండి

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

గ్రామపంచాయతి కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని జిల్లా ఎపి గ్రామ పంచాయతి ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు నన్నపనేని శివాజీ అన్నారు. బుధవారం పెదకాకాని పంచాయతి కార్యాలయం వద్ద ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతి కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ సబ్బులు, నూనె, మాస్కులు, యూనిఫాంలు ఇవ్వలేదని అంతేకాకుండా గ్రీన్ అంబాసిడర్లకు రూ.6 వేలు ఏమాత్రం సరిపోవడం లేదని,పెరిగిన ధరలకు అనుకూలంగా కనీస వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే రోశయ్య

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణ 8వ వార్డులో దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో ఎమ్మెల్యే వెంకట రోశయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర మైనారిటీ కమీషన్ సభ్యులు షేక్ సైపుల్లా , జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పెరికల కృష్ణ మోహన్, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ దాసరి నారాయణరావు , మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంక టేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ

ప్రజాశక్తి-ఎఎన్యూ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల హానర్స్ డిగ్రీని ప్రవేశపెడుతున్నట్లు వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలో జరిగిన డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, బిఓఎస్ చైర్మన్ లు, ఆయా విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ ఏడాది నుంచి డిగ్రీ కోర్సులను నాలుగేళ్ల కాలవ్యవధితో నిర్వ హిస్తామని, ఇందులో రెండు విభాగాలుగా విభజించినట్లు పేర్కొన్నారు. గతంలో డిగ్రీ కోర్సులు చదివేవారు మూడు సబ్జెక్టులను ఎంచుకొని డిగ్రీ కోర్సును పూర్తి చేసేవారు. అయితే ప్రస్తుతం వచ్చిన మార్పుల్లో ఒకే సబ్జెక్టు మీద మూడేళ్ల డిగ్రీ కోసం పూర్తి చేసి నాలుగో ఏడాది హానర్స్ బై రీసెర్చ్ కింద చేరే అవకాశాలు కల్పించనున్నారు . ఇందులో 75 శాతం మెరిట్ ఉన్న వారికి మాత్రమే హనర్స్ బై రీసెర్చ్ లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఇది ఏడాది పాటు రెండు సెమిస్టర్ల విధానంలో జరుగుతుందని వీసి స్పష్టం చేశారు. 4వ ఏడాది మొదటి సెమిస్టర్ లో రీసెర్చ్ మెథడాలజీ వంటి అంశాల మీద అభ్యసనం, రెండవ సెమిస్టర్ లో అభ్యర్థి ఎంచుకున్న అంశంపై ప్రాజెక్టును సమర్పించాల్సి ఉంటుంది. వీటిలో మెరిట్ సాధించిన అభ్యర్థులు పీజీ అడ్మిషన్ల విభాగానికి దరఖాస్తు చేసుకుంటే నేరుగా పరిశోధన చేసే అవకాశాన్ని పొందుతారని వీసీ వివరించారు. ప్రభుత్వం జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించిందని ఈ మేరకు ఆయా కోర్సులలో మార్పులు, చేర్పులు చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే అన్ని సబ్జెక్టులకు సంబంధించి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ లతో సిలబస్ రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు. నాలుగేళ్ల హానర్స్ కోర్సులో మొదటి ఏడాది అన్ని కోర్సుల విద్యార్థులకు కామన్ సిలబస్ ఉంటుందని, రెండవ,మూడవ ఏడాది అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టుకు అనుగుణంగా బోధన ఉంటుందన్నారు. నాలుగవ ఏడాది వచ్చేసరికి హానర్స్ బై రీసెర్చ్ లో విద్యార్థి ప్రవేశం ఉండనుందని వివరించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త మార్పులతో విద్యార్థులకు కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే పరిశోధన వైపు ఆసక్తి చూపే వారికి నిబంధనల మేరకు పీహెచ్‌డిలు చేసే వీలును ఆయా విభాగాలు అవకాశం కల్పిస్తాయని వివరించారు.

సమావేశంలో రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్ మూర్తి, సిడిసి డీన్ ప్రొఫెసర్ కె.మధుబాబు, పీజీ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సంధ్య కోల్, యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ ఈ. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరందించాలని ధర్నా

ప్రజాశక్తి-కాకుమాను

మండల పరిధిలోని కాకుమాను బస్టాండ్ సెంటర్లో బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు కలిసి పొలాలకు సాగునీరు ఇవ్వాలని పైరు పాడైపోతుందని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బి. రామాంజనేయులు మాట్లాడుతూ కేసులకు భయపడి నీటిని కూడా కేంద్రాన్ని అడగలేని అసమర్ధ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి కృష్ణ,సాగర్ జలాల్లో మన హక్కులను సాధించలేక తెలంగాణ ప్రభుత్వానికి మన నీటిని వదిలేసిన అసమర్ధ ముఖ్యమంత్రి అని విమర్శించారు. దీనివలనే రైతులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని, కనీసం ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సాగునీరు కూడా సకాలంలో అందించలేక పోతోందని అన్నారు. మండలంలో నీటి కోసం ధర్నా జరుగుతున్న విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే ధర్నా జరుగుతున్న స్థలం వద్దకు తహశీల్దార్, ఇరిగేషన్ అధికారులు వెళ్లారు. కొమ్మూరు కెనాల్‌కు నీటిని విడుదల చేసి చిట్టచివరి ఆయకట్టు వరకు నీటిని అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు తమ ధర్నాను విరమించారు. ధర్నాలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఎన్ అగస్టీన్, రాష్ట్ర తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు ,సంఘం డైరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి, రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పెదనందిపాడు

విద్యార్థులు దసరా సెలవుల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్టియు గుంటూరు జిల్లా పూర్వ అధ్యక్షులు గేరా మోహనరావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పెదనందిపాడు శాఖా శాఖగ్రంథాలయం లో ఈ నెల 14వ తేదీ నుండి 24వ తేదీ వరకు దసరా సెల వుల్లో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం జరిగిన కార్యక్రమలో పాల్గొన్న మోహనరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక సామాజిక దేవాలయాలని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గ్రంథాలయ నిర్వహకురాలు పి.సుభాషిని తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు కథలు వినడం, 8:30 నుండి 10 గంటల వరకు పుస్తకాలను చదవడం, పది నుండి పది న్నర వరకు పుస్తక సమీక్ష, 10:30 నుండి 11 గంటల వరకు కథలు చెప్పడం, 11 గంటల నుండి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీష్,చిత్రలేఖనం,డ్రాయింగ్ ,పెయింటింగ్, ఆటలు /పాటలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'చదువు అంటే మాకిష్టం' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కొలగాని మంజుల, కె రాజబాబు,విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్టీసి గుంటూరు డిపో మేనేజర్ కార్యాలయంలో నేడు డయల్ యువర్ డిపో మేనేజర్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ ఎస్.కె.అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుండి 12 గంట వరకూ ఈ కార్యక్రమం ఉంటుందనానరు. కావున గుంటూరు, పరిసర ప్రాంత ప్రయాణీకులు గుంటూరు-హైదరాబాద్, గుంటూరు- తెనాలి, గుంటూరు- విజయవాడ, గుంటూరు-విశాఖపట్నం రూట్‌లలో తిరుగుచున్న బస్‌ల గురించి, సిబ్బంది పనితీరు గురించి ప్రయాణీకులు 9959225421 నంబర్‌కు ఫోన్ చేసి తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీని చెప్పకండి

జిల్లా సచివాలయాల శాఖ నోడల్ అధికారి మహాలక్ష్మి

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

ప్రభుత్వ పథకాలు, సర్వేల కోసం ఓటిపిలు చెప్పాలంటూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ మరియు సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా సచివాలయ శాఖ నోడల్ అధికారిణి మహాలక్ష్మి సూచించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. అపరిచిత వ్యక్తులు మరియు సైబర్ నేరగాళ్లు ఓటీపీలు అడుగుతూ ప్రజలు బ్యాంకులో దాచుకున్న డబ్బులను కాజేసే ప్రమాదం ఉందని ఆమె అన్నారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువైన నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఈ ప్రకటన విడుదల చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఏ పథకానికి అయినా ఓటీపీ తప్పనిసరి అయినప్పటికీ సచివాలయ సిబ్బంది మరియు వాలంటీర్లు లబ్ధిదారుల వద్దకు నేరుగా వస్తారని ఫోన్ చేసి ఓటిపి చెప్పాలని అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పారాదన్నారు. సచివాలయం నుంచి చేస్తున్నాము ఓటిపి చెప్పండి అని తరచుగా ఫోన్ కాల్స్ సందేశాలు వస్తుంటే దగ్గర్లోని గ్రామ సచివాలయంలో లేదా పోలీస్ పోలీస్ స్టేషన్లో క ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు.

సవాళ్లను అధిగమించాలి

విజ్ఞాన్స్ సదస్సులో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ సిజిఎం పట్నాయక్

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న పట్నాయక్

దేశ పురోగతికి ఆటంకం కలిగించే సవాళ్లను అధిగమించి, అభివృద్ధి వైపు పయనించాలని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ బీఎమ్. పట్నాయక్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఏఐసీటీఈ ఏర్పాటు చేసిన 'ద రోల్ ఆఫ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ - ద జర్నీ అండ్ ఫ్యూచర్ ఎక్స్‌పెక్టేషన్స్ ఫర్ వికాసిత్ భారత్- 2047 / డెవలప్డ్ భారత్ -2047' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాసం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ బీఎమ్.పట్నాయక్ మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశం ఆర్థిక వృద్ధి, సామాజిక, సాంకేతిక పురోగతి, స్థిరమైన అభివృద్ధి కోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించడం ద్వారా యువత చురుగ్గా పాల్గొనడానికి రోడ్ మ్యాప్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వృత్తి శిక్షణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సాంకేతికత ఉపయోగించుకోవడానికి పరిశోధన, ఆవిష్కరణలలో పెట్టుబడులను మెరుగుపరచాలన్నారు. యువతను అవసరమైన సాధనాలు, విజ్ఞానంతో సన్నద్ధం చేయడం ద్వారా వేగంగా మారుతున్న ప్రపంచంలో అభివృద్ధి వైపు ప్రయాణానికి శక్తివంతం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు పాల్గొన్నారు.

ఎఆర్‌టి కేంద్రంలో వ్యర్థాలు తొలగింపు

సిబ్బందిపై జిజిహెచ్ సూపరింటెండెంట్ అసంతృప్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలోని యాంటి రేట్రో వైరల్ చికిత్స (ఎఆర్‌టి) కేంద్రానికి వచ్చే ప్రాణంతక వ్యాధి బాధితులకు సత్వరమే వైద్య సేవలు అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం ఏఆర్‌టి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రంలో అస్తవ్యస్థంగా ఉన్నా వివిధ వస్తువులను ఆయనే స్వయంగా తొలగించారు. దాదాపు రెండు గంటల పాటు డాక్టర్ కిరణ్ కుమార్‌తో పాటు వైద్య సిబ్బంది శ్రమ దానం చేసి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించారు. ఈ సందర్భంగా మీడియాతో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఏ ఆర్ టి కేంద్రానికి ప్రతి రోజు 200 నుంచి 500 మంది బాధితులు వస్తున్నారని చెప్పారు. ఈ కేంద్రం లో రక్త పరీక్షలు నిత్యం చేస్తూ వాటి ఫలితాలను రోగులకు అందించడం లో సిబ్బంది చక్కగా పని చేస్తున్నారు. బాధితులకు అవసరమైన మందులు, పౌష్టికహార పదార్థాలను అందిస్తున్నారు. ఈ వ్యాధి ని తగ్గించడానికి మందులు లేకపోయినా కొంతవరకు జీవిత కాలం ను పొడిగించేందుకు మందులు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు. ఇప్పటికి కొంతమంది బాధితులు వివక్షత కు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమాజం లో ప్రతి ఒక్కరిని ఆదరించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ఈ కేంద్రం లో నెలకున్న సమస్యలను గుర్తించామని కొన్ని చోట్ల మారమ్మత్తు పనులు పూర్తి చేసి రోగులకు అందుబాటులో తెస్తామని ఆయన చెప్పారు. సూపరింటెండెంట్ వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ యం ఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని ఉన్నారు.

నవంబర్ 10 నుండి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, తదితరులు

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయటానికి పాఠశాల స్థాయి నుండి, రాష్ట్ర స్థాయి వరకూ నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా జెవివి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నవంబర్ 10న పాఠశాల స్థాయిలో, నవంబర్ 30న మండల/పట్టణ స్థాయిలో, డిసెంబర్ 17న జిల్లా స్థాయిలో, జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో ఈ సంబరాలు ఉంటాయని, వీటిల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. కావున ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు ప్రోత్సహించాలని కోరారు. ఇతర వివరాలకు 9703579996, 9948015701 నంబరులో సంప్రదించాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో జెవివి నాయకులు డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్, జి.వెంకటరావు, బి.ఉదయభాస్కర్, బి.శంకర్‌సింగ్, ఎస్.ఎం.సుభాని, యం.ఉదయ భాస్కర్, రాంబాబు, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

ఇస్రో సైంటిస్ట్ జగన్మోహనరావు

ప్రజాశక్తి-గుంటూరు

అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో కీర్తి విశ్వవ్యాప్తంగా చాటుకుందని, ఇస్రోలో సేవలందించేందుకు విద్యార్థులు శాస్త్రవేత్తలుగా తయారయ్యే దిశగా కృషి చేయాలని ఇస్రో శాస్త్రవేత్త, ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి పూర్వ విద్యార్థి జి.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కర్నాటకలోని హాసన్ సెంటర్, ఇస్రో అంతరిక్ష పరిశోధనా కేంద్రంలో మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ విభాగంలో సైంటిస్ట్/ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.జగన్మోహన్ రావు కళాశాలలోని ఐఈటిఈ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో 'ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్ ప్రెజంట్ ఫ్యూచర్' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, దేశంలో వివిధ ప్రాంతాల్లోని ఇస్రో పరిశోధనా కేంద్రాల్లో జరిపే పరిశోధనలు, శాటిలైట్ ప్రయోగాలు, దాని పనితీరు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా తయారు కావటానికి అనుసరించాల్సిన విద్యా విధానాన్ని గురించి సూచనలు చేశారు. ఇస్రో అనేక పరిశోధనల్లో విప్లవాత్మక విజయాలను సాధించటమే కాకుండా, ప్రస్తుత ప్రపంచంలోని అగ్రగామి అంతరిక్ష రంగ సంస్థల్లో ఒకటిగా నిలిచిందన్నారు. భవిష్యత్‌లో జరిపే గగన్‌యాన్, చంద్రయాన్-4 లుపెక్స్, శుక్రయాన్, మంగళ్యాన్-2, ఎక్స్‌పో సట్, నిస్సార్, స్పాడెక్స్ తదితర ఉపగ్రహ ప్రయోగాల విజయాలే ఇస్రో ముందున్న లక్ష్యమని అన్నారు. అమెరికా రష్యా దేశాల నుండి దిగుమతి చేసుకున్న రాకెట్లను ప్రయోగించే స్థాయి నుండి అనతికాలంలోనే భారత దేశం స్వదేశీయంగా పూర్తిస్థాయి రాకెట్లను తయారు చేసి, ఉపరితల అధ్యయనంలో పురోగతి సాధించుకోవటం గర్వకారణమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ అన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, ఎన్.వి.శ్రీనివాసరావు, ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ టి.రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

విద్యార్థి దశలోనే ప్రతి విద్యార్థి లక్ష్యం నిర్దేశించుకుని లక్ష్యసాధనకు కృషి చేయాలని త్వరితగతిన ఉపాధి అవకాశాలు అంది పుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షిస్తున్నట్లు కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక చిలకలూరిపేట రోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహ భరితంగా సాగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాతాని మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే వేడుకలు వలన విద్యార్థులలో స్నేహ పూర్వక సంబంధాలు మెరుగుపడతాయన్నారు. ప్రతి విద్యార్థి తోటి విద్యార్థుల పట్ల, అధ్యాపకుల పట్ల, మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని క్రమ శిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నీతి నిజాయితీగా మసులు కోవాలన్నారు. ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విడుదల చేసిన సెమిస్టర్ డిగ్రీ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి ఫలితాలు సాధించారన్నారు. అదేవిధంగా జిల్లా రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థులను ఫ్రెషర్స్ డే వేడుకల సందర్భంగా ప్రత్యేకంగా అభినందించి బహుమతులు అందజేశారు. వేడుకలు సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నైపుణ్యా లను పెంపొందించుకోవాలన్నారు. తమ కళాశాల విద్యార్థులకు నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అనుగుణంగా బాటలు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.